
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 2 మే 2025



ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు మంజూరు

శ్రీకాకుళం, మే 1(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ(ఎస్‌డీపీ) కింద రూ.12.84లక్షలు నిధులు విడుదలకు అనుమతి మంజూరు చేస్తూ గురువారం ప్రభుత్వ ఉత్తర్వులు విడుదలయ్యాయి. పాతపట్నంలో నేత కార్మికుల కామన్ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణ పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని.. ఇందుకు ఎస్‌డీపీ నిధులను వెచ్చించాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రణాళిక విభాగశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి పియూష్ కుమార్ జీవోను జారీచేశారు.



శ్రీకాకుళంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న కార్మికులు

హక్కుల కోసం పోరాడుదాం

- కార్మిక సంఘాల నేతల పిలుపు
- వాడవాడలా మేడే వేడుకలు

అరసవల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం.. మేడే స్ఫూర్తిగా హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు చేద్దామని వివిధ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలో గురువారం పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో డైమండ్ పార్క్ నుంచి ఏడురోడ్ల జంక్షన్ వరకూ భారీ ర్యాలీ చేశారు. వందలాది మంది ఎర్రజెండాలు చేత బూని కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలతో హోరెత్తించారు. డప్పులు, వాయిద్యాలు, కర్రసాముతో చైతన్యవంతంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఏడురోడ్ల జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సభలో సీనియర్ కార్మికులను ఘనంగా సత్కరించారు. సీఐటీయూ సీనియర్ నాయకుడు బి.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. 'కార్మిక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయి. ఆ విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఐక్యమవ్వాలి. పెట్టుబడిదారీ విధానం అంపశయ్యపై ఉంది. ప్రపంచానికి సోషలిజమే ప్రత్యామ్నాయమ'ని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కిషోర్, గిరిధర్, ఎం.శ్రీనివాస్, పోస్టల్ యూనియన్ నాయకుడు జ్యోతీశ్వరరావు, ఎం.గోవర్ధనరావు, సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాష్‌రావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.భీమారావు, కె.అప్పన్న, ఉపాధ్యక్షుడు ఎం.ఆదినారాయణమూర్తి, ఏపీఎంఎస్‌ఆర్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వాసుదేవరావు, సతీష్, మహేష్, శ్రీనివాస్, మునిసిపల్ నాయకులు ఎన్.బలరాం, కళాసీ సంఘ నాయకులు బి.చిన్నారావు, కృష్ణవేణి, రాజేశ్వరి, మధ్యాహ్న భోజన, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అండగా నిలిచి.. ఆదరించి..

- అమరావతి ఉద్యమంలో మనం
- రాజధాని రైతుల గుండెల్లో సిక్కోలు
- అమరావతి టు అరసవల్లికి అడుగడుగునా అడ్డంకులు
- వాటిని అధిగమించి సూర్యభగవానుడి ఆలయం చెంతకు..
- ఉద్యమకారులకు జిల్లావాసుల ఆత్మీయ స్వాగతం



జేఆర్ పురంలో అమరావతి రైతులకు స్వాగతం పలికిన ఎంపీ కలిశెట్టి, స్థానికులు(ఫైల్)

రణస్థలం, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతి రైతుల ఉద్యమం చరిత్రలో నిలిచిపోతుంది. తమ భవిత కోసం... ఉనికి కోసం అమరావతి రైతులు, మహిళలు చేపట్టిన ఉద్యమం... సాగించిన పోరాటం చరిత్రలో లిఖించదగ్గది. అందుకు శ్రీకాకుళం జిల్లా కూడా వేదిక కావడం విశేషం. శుక్రవారం అమరావతిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా రాజధాని పనులు పునః ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యమకారులకు జిల్లావాసులు మద్దతుగా నిలిచిన వైనం గురించి తెలుసుకుందాం. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అందరి ఆమోదంతో అమరావతిని రాజధానిగా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. నాటి సీఎం చంద్రబాబుపై నమ్మకంతో 32వేల మంది రైతులు తమ భూములను ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. తమ పిల్లల భవిష్యత్ బాగుంటుందని కలలు కన్నారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మూడు రాజధానుల అంశం తెరపైకి వచ్చింది. విశాఖను పాలనా రాజధానిగా.. కర్నూలును న్యాయ రాజధానిగా చేసి ..అమరావతిని శాసన రాజధానికి పరిమితం చేయాలని చూశారు. దీంతో అమరావతి రైతుల గుండె రగిలిపోయింది. భవిష్యత్‌పై వారు పెట్టుకున్న ఆశలు పేకమేడలా కుప్పకూలిపోయాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నుంచి టీడీపీ, జనసేన, వామపక్షాలు.. ఇలా అన్ని రాజకీయ పార్టీలు అమరావతికి జై కొట్టాయి. అమరావతి రైతుల ఉద్యమానికి మద్దతు తెలిపాయి. కానీ వైసీపీ ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. దీంతో అమరావతి రైతులు ఓ వైపు ఆందోళనలు... మరోవైపు న్యాయ పోరాటం చేశారు. ఇంకో వైపు ఆధ్యాత్మిక యాత్రలు చేపట్టారు. ముందుగా అమరావతి టు తిరుపతి దేవస్థానం కార్యక్రమాన్ని నిర్వహించారు. తరువాత అమరావతి టు అరసవల్లి కార్యక్రమాన్ని తలపెట్టారు. 2022 సెప్టెంబరు 13న అమరావతి నుంచి అరసవల్లికి రైతులు పాదయాత్ర ప్రారంభించారు. కాని దారి పొడవునా వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధుల అడ్డగింపులు, అరెస్టులు, దాడులు కొనసాగాయి. దీంతో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో యాత్ర నిలిచిపోయింది. తిరిగి 2023 మార్చి 31న ప్రారంభమైంది. మన జిల్లాలోకి ఏప్రిల్ 2న ప్రవేశించింది. శ్రీకాకుళం జిల్లా ప్రజలు అమరావతి రైతులకు అప్యాయంగా స్వాగతం పలికారు. అది 29 గ్రామాల సమస్య కాదని.. యావత్ రాష్ట్రానిదని గుర్తించారు. విశాఖను పాలనా రాజధానిగా ప్రకటించినా.. ఉత్తరాంధ్ర అభివృద్ధి జరుగుతుందని ఆశలు కల్పించినా వినలేదు. అమరావతి ఉద్యమ రైతులకు అండగా నిలిచారు. జే.ఆర్.పురం వద్ద రైతులకు ప్రస్తుత విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అప్పట్లో స్వాగతం పలికారు. వారికి దుస్తులను అందించారు. అమరావతిలో రథయాత్రగా బయలుదేరిన రైతులు అరసవల్లిలో పూజలు చేశారు. అమరావతిని శాశ్వత రాజధానిగా ఉండేలా చూడాలని ప్రత్యక్ష భగవానుని కోరుకున్నారు. సూర్యభగవానుడి దివ్య ఆశీస్సులతోనే నేడు అమరాతి రాజధాని పునర్నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేస్తున్నారని జిల్లా ప్రజలు, అమరావతి రైతులు చెబుతున్నారు.




శ్రీకాకుళం నుంచి అమరావతికి బస్సుల్లో తరలివెళ్తున్న ప్రజలు

అమరావతికి జిల్లావాసుల పయనం

శ్రీకాకుళం, మే 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని 'అమరావతి'కి జిల్లా ప్రజలు అత్యధికంగా తరలివెళ్లారు. శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమరావతికి రానున్నారు. రాజధాని పనులు పునః ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మోదీ సభలో పాల్గొనేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతోపాటు జిల్లా ప్రజలు గురువారం సాయంత్రం బయలుదేరారు. నియోజకవర్గాలు, మండలాల నుంచి ప్రత్యేక బస్సులు, ప్రైవేటు వాహనాల్లో తరలివెళ్లడంతో అంతటా సందడి నెలకొంది.





శ్రీకాకుళంలో గురువారం రాత్రి కురుస్తున్న వర్షం

సిక్కోలులో జోరు వాన

- ఈదురుగాలుల బీభత్సం



శ్రీకాకుళంలో రహదారిపై నిలిచిన వర్షపునీరు

శ్రీకాకుళం, మే 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం రాత్రి జోరువాన కురిసింది. ఉరుములు.. మెరుపులతో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాత్రి పది గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. శ్రీకాకుళం, ఎచ్చెర్ల తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులతో భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్నిచోట్ల ఇళ్లలోకి వర్షపునీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులు బలంగా వీయడంతో శ్రీకాకుళంలో పలుచోట్ల హోర్డింగ్‌లు విరిగిపడ్డాయి. శ్రీకాకుళం రూరల్‌తోపాటు పలుచోట్ల చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లపై పడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో సుమారు రెండున్నర గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అంతటా అంధకారం అలుముకుంది.

శ్రీకాకుళం కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్

శ్రీకాకుళం, మే 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నియమితులయ్యారు. ఏళ్ల తరబడిగా శ్రీకాకుళం కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించలేదు. పంచాయతీల విలీనం నుంచి.. డివిజన్‌ల విభజన వరకు ఉన్న అభ్యంతరాల వ్యవహారం కోర్టులో కొనసాగుతోంది. దీంతో దశాబ్దానికిపైగా నగరపాలక సంస్థకు ప్రత్యేక అధికారిగా కలెక్టర్ కొనసాగుతున్నారు. ప్రతి ఆరునెలలకోసారి ప్రత్యేక అధికారి పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగిస్తోంది. తాజాగా ఈ ఏడాది అక్టోబర్ పదో తేదీ వరకు కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా కొనసాగిస్తూ... ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులను జారీచేశారు.

బీచ్ ఫెస్టివల్‌కు పకడ్బందీ ఏర్పాట్లు 7లో

పారిశుధ్యం లోపిస్తే కఠినచర్యలు

- అధికారుల తీరుపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం

జి.సిగడాం, మే 1(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం లోపిస్తే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు. గురువారం వాండ్రంగిలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. పలు వీధుల్లో అపరిశుభ్రత కనిపించడంతో సంబంధిత అధికారులపై మండిపడ్డారు. కాలువల్లో ఎన్నాళ్ల నుంచి పూడికలు తీయలేదని పంచాయతీ అధికారులను ప్రశ్నించారు. ఇలా అయితే ప్రజలు రోగాల బారిన పడతారని, రహదారులపై నిర్మాణాలు చేపడుతుంటే ఏమీ చేస్తున్నారని నిలదీశారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహించిన పంచాయతీ కార్యదర్శి గౌరీశంకర్‌కు షోకాజ్ నోటీసులు జారీచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇటువంటి పునరావృతమైతే సస్పెండ్ చేస్తామని పంచాయతీ కార్యదర్శిని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా ఉండి సేవలు అందించాలని స్పష్టం చేశారు. అలాగే వాండ్రంగిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన ఇంకుడు గుంతలను కలెక్టర్ పరిశీలించారు. వాటి నిర్వహణపై అడిగిన ప్రశ్నలకు ఉపాధిహామీ సిబ్బంది సరైన సమాధానం ఇవ్వలేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అవగాహనతో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఏవో రామకృష్ణ, సర్పంచ్ సాకేటి నాగరాజు, మాజీసర్పంచ్ బూరాడ వెంకటరమణ, బోట్ల భాస్కరరావు, డబ్బాడ రామారావు, ఏపీవో సత్యనారాయణ, ఏపీఎం రామకృష్ణనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కుసుమ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మరో రెండు నెలలు

- రేషన్‌కార్డుదారుల ఈకేవైసీ నవీకరణకు గడువు పెంపు
- జూన్ నెలాఖరు వరకూ అవకాశం
- ఇప్పటికీ జిల్లాలో 98,250 మందికి పెండింగ్
- బయోమెట్రిక్‌లో సాంకేతిక ఇబ్బందులు

మెళియాపుట్టి మండలం సుందరాడ గ్రామానికి చెందిన పడల కల్పనకు కూడా ఇదే సమస్య ఎదురవుతోంది. ఇంతకముందే ఈకేవైసీ పూర్తిచేసినా.. డీలర్ వద్ద జాబితాలో పెండింగ్ అని చూపుతోందని ఆమె వాపోతోంది.

మెళియాపుట్టి మండలం జలగలింగుపురం గ్రామానికి చెందిన గొర్లె గణేష్, కావ్య, అశ్వత... ఒకే రేషన్‌కార్డులో ఉన్నారు. ఈ ముగ్గురూ గ్రామంలోనే నివసిస్తున్నా.. ఈకేవైసీ పెండింగ్ వచ్చింది. డీలర్ వద్ద వెళ్లి బయోమెట్రిక్ వేసినా ఈకేవైసీ పెండింగ్ అని చూపుతోంది. మీ-సేవ కేంద్రానికి వెళ్లి బయోమెట్రిక్ వేయగా ఇంతకముందే ఈకేవైసీ ప్రక్రియ పూర్తయిందని చూపుతోంది. దీంతో ఏమిచేయాలో తెలియక ఆ ముగ్గురూ ఆందోళన చెందుతున్నారు.



సుందరాడలో డీలర్ వద్ద ఈకేవైసీ వేస్తున్న రేషన్‌కార్డుదారులు

- మెళియాపుట్టి మండలం లింగుపురానికి చెందిన నడిమింటి తేజేశ్వరరావు హైదరాబాద్‌లో ఉపాధి పొందుతూ నివసిస్తున్నాడు. రేషన్‌కార్డు మాత్రం ఇక్కడే ఉంది. అప్పుడప్పుడూ రేషన్ సరుకులు తీసుకునేవాడు. ప్రస్తుతం ఈకేవైసీ పెండింగ్ చూపుతుండడంతో ఇక్కడకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నాడు.
- ఇటువంటి రేషన్‌కార్డుదారులకు మరో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఈకేవైసీ నవీకరణకు రెండు నెలలు గడువు పెంచింది. దీంతో రేషన్‌కార్డుదారులకు కాస్త ఉపశమనం లభించనుంది.

మెళియాపుట్టి, మే 1(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారుల ఈకేవైసీ అప్‌డేట్(నవీకరణ)కు ప్రభుత్వం మరోసారి గడువు పెంచింది. బోగస్ కార్డుల ఏరివేతకు, రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకుగానూ ఈకేవైసీ తప్పనిసరిగా నవీకరణ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. తొలుత మార్చి నెలాఖరు వరకు గడువు విధించింది. తర్వాత ఏప్రిల్ 30 వరకు గడువు పెంచింది. అయిన ప్పటికీ బయోమెట్రిక్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో జిల్లాలో ఈ ప్రక్రియ సజావుగా సాగడం లేదు. జిల్లాలో ఇప్పటివరకూ 98,250 మందికి ఈకే వైసీ పెండింగ్ ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యం లో ప్రభుత్వం మరో రెండు నెలలు గడువు పొడిగించింది. జూన్ 30వ తేదీనాటికి ఈకేవైసీ ప్రక్రియ శతశాతం పూర్తిచేయాలని స్పష్టం చేసింది.

ఇదీ పరిస్థితి

జిల్లాలోని 1,625 డిపోల పరిధిలో 6,71,803 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతినెలా 422 ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు సరఫరా చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 19,41,391 మంది రేషన్‌కార్డుదారులు ఉండగా.. గురువారం నాటికి 98,250 మందికి ఈకేవైసీ పెండింగ్ చూపుతోంది. ఇందులో ఐదేళ్లలోపు చిన్నారులు 29,933 మంది, 80 ఏళ్ల దాటిన వృద్ధులు 2,013 మంది ఉన్నారు. వీరికి బయోమెట్రిక్ పడే పరిస్థితి లేదు. చాలాచోట్ల బయోమెట్రిక్‌లో ఇబ్బందులు ఎదురవడం, స్థానికంగా కొంత మంది అందుబాటులో ఉండకపోవడంతో ఈకేవైసీ నమోదు శతశాతం పూర్తికావడం లేదు. దీంతో రేషన్ సరుకులు అందని చాలా మంది రేషన్‌కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా ప్రభుత్వం మరో రెండు నెలలు ఈకేవైసీ నవీకరణ గడువు పెంచడంతో ఊరట చెందుతున్నారు.

తేలనున్న బోగస్

వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ బియ్యం పక్కదోవ పట్టాయి. మృతుల పేరిట సైతం కొంతమంది రేషన్ సరుకులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే జిల్లాలో కొన్ని బోగస్ కార్డులు కూడా ఉన్నాయని తెలుస్తోంది. ఒడిశా రాష్ట్రానికి చెందిన కొంతమంది వ్యక్తులు.. ఆంధ్రాలో చదువుల కోసం రేషన్ కార్డులు గతంలో పొందారనే ఆరోపణలు ఉన్నాయి. మెళియాపుట్టి మండలంలో నడసందర,

(మిగతా 6వ పేజీలో..)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలంలో ట్రాక్టర్, గాయపడిన శరణ్య

ఇచ్ఛాపురం, మే 1(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోగల వీకేపేట రోడ్డులో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌తోపాటు ద్విచక్రవాహనంపై వస్తున్న మహిళకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని పెద్ద ఆకులవీధికి చెందిన కిల్లంశెట్టి శరణ్య ద్విచక్రవాహనంపై రత్తకన్న వైపు వెళ్తోంది. అదే సమయంలో రత్తకన్న నుంచి ఇచ్ఛాపురం వైపు కవిటి మండలానికి చెందిన సవరాశి దుదిష్టి ట్రాక్టర్ నడుపుకొంటూ వస్తున్నాడు. ఆ సమయంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి ట్రాక్టర్ దూసుకెళ్లింది. దీంతో శరణ్య, ట్రాక్టర్ డ్రైవర్ దుదిష్టికి గాయాలుకావడంతో 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం బరంపురం తరలించారు. పట్టణ ఎస్ఐ ముకుందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టు కానిస్టేబుల్ సస్పెన్షన్: సీఐ



మాట్లాడుతున్న సీఐ సూర్యనారాయణ

పలాస, మే 1(ఆంధ్రజ్యోతి): పలాస కోర్టు కానిస్టేబుల్ నారాయణను బుధవారం రాత్రి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. గురువారం సీఐ విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఆ మేరకు... ఎనిమిదేళ్లుగా కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ నారాయణ పలాస కోర్టు కానిస్టేబుల్‌గా వ్యవహరిస్తున్నారు. కోర్టు ద్వారా కక్షిదారునికి ఇవ్వాల్సిన రూ. 10 లక్షల నగదు, మరో కేసులో 6.5 తులాల బంగారాన్ని సొంతానికి వినియోగించుకున్నాడని ఆయనపై అభియోగాలు వచ్చాయి. దీంతో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఎస్ఐ చంద్రరావును ఎస్పీ ఆదేశించారు. ఈ మేరకు ఎస్ఐ విచారణ చేపట్టి కానిస్టేబుల్ నారాయణ నగదు, బంగారాన్ని సొంతానికి వినియోగించుకున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి ఎస్పీకి నివే దించారు. ఈ మేరకు నారాయణను సస్పెండ్ చేసి ఉత్తర్వులిచ్చారన్నారు. ఈ వ్యవహారంపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నరసన్నపేట, మే 1(ఆంధ్రజ్యోతి): ఉర్లాం రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొత్తపోలవలసకి చెందిన తలగాన గోవిందరావు (35) శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు జీఆర్పీ హెచ్‌సీ మధుసూదనరావు తెలిపారు. మృతదేహానికి పంచనామా చేసి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

1300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

హరిపురం, మే 1(ఆంధ్రజ్యోతి): మందస మండలం రామరాయి గ్రామంలో గురువారం నవోదయం 2.0లో భాగంగా దాడులు చేసి 400 లీటర్లు, గోపిటూరులో 900 లీటర్లు, మొత్తం 1300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు సీఐ కె.బేబీ తెలిపారు. అనుమానితుడిగా సవర రంగారావును అదుపులోకి తీసుకున్నామన్నారు. వీఆర్వో తులసీదాసు, సర్వేయర్ వినోద్ సహకారంతో సారా నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీవీ రమణ, ఎస్ఐ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు, సీఐ శ్రీనివాసరావు

నరసన్నపేట, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొత్త పోలీసు స్టేషన్ నిర్మాణానికి గాను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు గురువారం స్థలాలను పరిశీలించారు. మార్చి 11న 'ఆంధ్రజ్యోతి'లో 'ఏ క్షణం... ఏమవుతుందో' శీర్షికన కథనం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ కథ నానికి ఎస్పీ మహేశ్వరరెడ్డి స్పందించారు. కొత్త భవన నిర్మాణానికి ప్రభు త్వానికి ప్రతిపాదన లు పంపారు. ఈ మేరకు ఇంజనీరింగ్ అధికారులు డీఈఈ కోదండరావు ఆధ్వర్యంలో అధికారులు పాతకోర్టు భవన ప్రాంగణం, పోలీసు క్వార్టర్స్ భవనాల వద్ద స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఏఈలు రాంబాబు, తరుణ్, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గొలుసుకట్టు చెరువుల అభివృద్ధికి సర్వే



సీతసాగరాన్ని సర్వే చేస్తున్న వంశధార అధికారులు

నందిగాం, మే 1(ఆంధ్రజ్యోతి): గొలుసుకట్టు చెరువుల అభివృద్ధికి సర్వే ప్రారంభమైంది. ఈ మేరకు గురు వారం వంశధార ప్రాజెక్ట్ ఎస్ఈ ప్రగడ వెంకట తిరుపతిరావు. టెక్కలి వంశధార ఈఈ శేఖరరావు పర్యవేక్షణలో సర్వే బృందం నియోజకవర్గంలోని నందిగాం సీతసాగరం, లచ్చన్నపేట సమీపంలోని మదన గోపాల సాగరాన్ని పరిశీ లించారు. మంత్రులు నిమ్మల రామా నాయుడు, కింజరాపు అచ్చెన్నా యుడు మదన గోపాల సాగరాన్ని పరిశీలించి గొలుసు కట్టు చెరువుల అభివృద్ధికి సూచనలు చేయడంతో ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఈ తెలిపారు. నందిగాం సీత సాగరాన్ని మినీ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దేందుకు సర్వే చేపడుతున్నా మన్నారు. కార్యక్రమంలో నందిగాం నీటి సంఘం అధ్యక్షుడు కె.జయరాం, రైతులు టి.రవికుమార్ పాల్గొన్నారు.

పల్లిపేటలో భూముల పరిశీలన



రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో సాయి ప్రత్యూష

పోలాకి, మే 1(ఆంధ్రజ్యోతి): పల్లిపేట పంచాయతీ పరిధిలోని సర్వే నం 278-1 భూములను గురువారం శ్రీకాకుళం ఆర్డీఓవో సాయిప్రత్యూష పరిశీ లించారు. గ్రామస్థులు భూమి తగదా విషయమై సీఎంవోకు ఫిర్యాదు చేయగా ఆర్డీవో పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ మంగిపూడి సురేష్‌కుమార్, ఆర్ఐ శ్రీనివాసరావు, సర్వేయర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా మేడే వేడుకలు

కార్మిక దినోత్సవాన్ని జిల్లాలో గురువారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా ఎర్ర జెండాలను ఎగురవేశారు. వివిధ ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న వారిని సత్కరించారు. కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

-(శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి)



అరసవల్లి: పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో టీఎన్‌టీయూసీ మేడే వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్



పాతపట్నం: ఆలాంధ్ర కూడలిలో కార్మిక పతాకానికి వందనం..



పలాస: జీడి కార్మిక సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తిని సత్కరిస్తున్న మహిళలు



ఎచ్చెర్ల: శ్యాంపిస్టన్స్ పరిశ్రమ వద్ద



ఆమదాలవలస: ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వాములు

● మంత్రి అచ్చెన్నాయుడు

అరసవల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ స్ఫూర్తి అన్ని రంగాలకు విస్తరిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వాములన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.



నరసన్నపేట: జట్టు కలాసీ యూనియన్ కార్యాలయం వద్ద మేడే వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ప్రధాని పర్యటనను విజయవంతం చేయండి



బస్సుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, మే 1(ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని మోదీ అమరావతి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభ కార్యక్రమానికి గాను నియోజకవర్గం నుంచి 10 బస్సుల్లో కూటమి నేతలు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. ఈ బస్సులకు గురువారం ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు.



కవిటిలో జెండా ఊపి ప్రారంభిస్తున్న విప్ అశోక్

● కవిటి, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతిలో శుక్రవారం జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభకు కవిటి మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్య కర్తలు గురువారం తరలివెళ్లారు. ఈ మేరకు బస్సుకు జెండా ఊపి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ ప్రారంభించారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నిర్మల

టెక్కలి, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం కోసం రూపొందించబడిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల అన్నారు. గురువారం టెక్కలి ఆర్టీసీ డిపోలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్మిక హక్కులు, చట్టాలను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, న్యాయవాదులు చంద్రశేఖర్ పట్నాయక్, పొట్నూరు ఆనందరావు, ఎస్ఐ రాము, డిపో మేనేజర్ శ్రీనివాసరావు, గోపాలకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం అందించాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి రాణి

కొత్తూరు, మే 1(ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.రాణి కోరారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా గురువారం మెట్టూరు జీడి ఫ్యాక్టరీ ఆవరణలో రైసుమిల్లు, జీడి కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్మికులు తమ పిల్లలను చదివించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎం.అప్పారావు, చల్లా రవికుమార్, ప్రభుత్వ ప్లీడర్ రాడ రాజు, గేదల ఫల్గుణరావు, అరుబోలు ధర్మారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న న్యాయాధికారి మాధురి

పలాస, మే 1(ఆంధ్రజ్యోతి): అసంఘటిత, పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని పలాస మున్సిఫ్ న్యాయాధికారి యు.మాధురి కోరారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు ప్రసూతి బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నారని, అటువంటి వారు తమ వివరాలను లేబర్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫయ్యాజ్ అహ్మద్ (ఘని), ఉపాధ్యక్షుడు టీకేఆర్ పట్నాయక్, న్యాయవాదులు జీఎంఎస్ అనిల్‌రాజు, పైల రాజరత్నం నాయుడు, వై.హేమకుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు పని కల్పించండి

పాతపట్నం, మే 1(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు పని కల్పించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం కొరసవాడ శ్రీ ఉమాశంకర చేనేత కార్మికులు నిర సన చేపట్టారు. మా సంఘానికి గత ఏడాది డిసెంబరు 3వతేదీ నుంచి ఇప్పటి వరకు పని కల్పించలేదన్నారు. సంఘ సభ్యులకు తెలియజేయకుండా కార్యాలయానికి ఇన్‌చార్జి శంకరరావు తాళాలు వేసి ఇబ్బందులు కలుగజేస్తున్నారని, తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అంతకుముందు కాగువాడలోని చంద్రయ్యకాలనీకి వచ్చిన చేనేతశాఖ ఏడీ జనార్దనరావుకు వినతిపత్రాలిచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి భగవతి దుర్గాగిరి అమ్మవారి జాతర

పోలాకి, మే 1(ఆంధ్రజ్యోతి): భగవతి దుర్గా గిరి దీర్ఘాశి అమ్మవారి 10వ జాతర శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ మూడురోజుల పాటు నిర్వహించే ఈ జాతరలో శుక్రవారం బాలికల కోలాటం, ఉత్సవ మూర్తుల ఊరేగింపు ఉంటుందన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు.

పెట్రోల్ బంకుపై విజిలెన్స్ అధికారుల దాడి



బంకులో నాణ్యత, నిల్వలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నరసన్నపేట, మే 1(ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌రోడ్డుని ఓ పెట్రోల్ బంకులో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు ఆదేశాల మేరకు సీఐలు సతీష్. రవిప్రకాశ్ ఆధ్వర్యంలో డీజిల్, పెట్రోలు నిల్వలు, సాంద్రత, కొలతలను పరిశీలించారు. తూనికలు కొలతల శాఖ ఆధ్వర్యంలో పంప్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో విజలెన్స్ ఎస్ఐ రామారావు, డీటీ శరత్‌కుమార్, వీఆర్వోలు శ్యామ్ పాల్గొన్నారు. ఈ బంకుపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆర్డీవో సాయిప్రత్యూష కూడా ఇటీవల తనిఖీ చేసిన కొద్దిరోజులకే విజిలెన్స్ అధికారులు తనిఖీ చేయడం చర్చనీయాంశమైంది.

త్వరలో బొడ్డపాడు-2 లేఅవుట్ డ్రా

కాశీబుగ్గ, మే 1 (ఆంధ్రజ్యోతి): త్వరలో బొడ్డపాడు-2 లేఅవుట్ డ్రా చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సుడా కార్యదర్శి ఎంవీ లక్ష్మి అన్నారు. గురువారం కాశీబుగ్గ హైస్కూల్లో బొడ్డ పాడు-1 మిగ్ లేఅవుట్‌లో ఇటీవల డ్రా ద్వారా ప్లాట్లు పొందిన వారికి ప్లాట్ అగ్రిమెంట్ ప్రక్రి యను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాట్‌లపై సమస్యలు, సందేహాలపై లబ్ధిదారుల అవగాహన కలిగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మోహన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందజేయాలి

టెక్కలి, మే 1(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను సకాలంలో అందజేయాలని ఆ సంఘ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా ట్రెజరీ అధికారి సీహెచ్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఏజీ కార్యాలయం నుంచి పంప బడిన పెన్షన్ పేమెంట్ ఆర్డర్ బదిలీలో జాప్యాన్ని పరిష్కరించాలని కోరారు. అర్హులైన పెన్షనర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రోణంకి రామచంద్రరావు, కార్యదర్శి ధర్మారావు, విశ్రాంత ఉద్యోగులు అయ్యబాబు, మల్లయ్య, స్టాలిన్, వీరాస్వామి పాల్గొన్నారు.

ఘనంగా పాతపట్నం అమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

నందిగాం, మే 1(ఆంధ్రజ్యోతి): సైలాడ పంచాయతీ దేవాడలో నూతనంగా నిర్మించిన పాతపట్నం అమ్మతల్లి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో పురోహితుడు బూరాడ విశ్వగురుశర్మ పర్యవేక్షణలో పూజలు శాస్త్రోక్తంగా జరిపారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మ వారిని దర్శించుకొని పూజలు చేశారు.

పారిశ్రామికవాడ వ్యాపారసంఘ కోశాధికారిగా వినయ్



కోశాధికారి వినయ్‌ని అభినందిస్తున్న సంఘ ప్రతినిధులు

పలాస, మే 1(ఆంధ్రజ్యోతి): ఇంగిలిగాం పారిశ్రామికవాడ వ్యాపారుల సంఘం కోశాధికారిగా కొంచాడ వినయ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో పనిచేసిన శాసనపురి శ్రీనివాసరావు ఆకస్మిక మృతిచెందడంతో గురువారం ఎన్నికలు నిర్వహించి వినయ్‌ని ఎన్నుకున్నారు. ఆయనను సంఘం అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, సీనియర్ సభ్యుడు తాళాసు నర్సింహమూర్తి, కేవీ గోపాల్ అభినందించారు.

బ్యారేజీ ఖాళీ..!

హిరమండలం, మే 1(ఆంధ్రజ్యోతి): గొట్టా బ్యారేజీ వద్ద ఉన్న నీటి నిల్వను వంశధార అధికారులు ఖాళీ చేశారు. గత నాలుగు నెలలుగా ఎగువ ప్రాంతంలో వర్షాలు లేకపోవడంతో ఇన్‌ఫ్లో పూర్తిగా పడిపోయింది. దీంతో బ్యారేజీ వద్ద నీటి నిల్వలు అడుగంటాయి. ఉన్న కొద్దిపాటి నీటిని గేట్లు పైకెత్తి బుధవారం నుంచి కిందకు విడిచిపెట్టారు. దీంతో బ్యారేజీ ఎగువ ప్రాంతంలో ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. ఈ సందర్భంగా డీఈఈ సరస్వతి మాట్లా డుతూ బ్యారేజీ గేట్లు ఆరబెట్టేందుకు నీటిని పూర్తిగా కిందకు విడిచిపెట్టామని తెలిపారు. గత ఆరేళ్లుగా బ్యారేజీ గేట్ల మరమ్మతులకు గానీ... గ్రీజు పెట్టేం దుకు కానీ నిధులు మంజూరు చేయకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో వీటి నిర్వ హణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సీజన్‌లో ప్రభుత్వం నిధులు మం జూరు చేస్తే పనులు చేపట్టేందుకు వీలుంటుందని అధికారులు చెబుతున్నారు.



గొట్టాబ్యారేజీ ఎగువ ప్రాంతంలో నిల్వ ఉన్న నీటిని కిందకు విడిచిపెట్టడంతో ఇసుక మేటలు కనిపిస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వజ్రపుకొత్తూరు, మే 1(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వజ్రపుకొత్తూరు, నువ్వలరేవు, బెండి, పల్లిపూరు. నగరంపల్లి, మంచినీళ్లపేట పంచాయితీలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

పాతపట్నంలో రేపు..

పాతపట్నం, మే 1(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ పాతపట్నంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాతపట్నం పట్టణ పరిధిలోని లైన్ నిర్వహణ చేపడుతున్నందున శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

హిరమండలం ఈవోగా శివాజీ

హిరమండలం, మే 1(ఆంధ్రజ్యోతి): హిరమండలం మేజర్‌పంచాయతీ ఈవోగా ఇంటి శివాజీని పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ జిల్లా పంచా యతీ అధికారి కె.భారతి సౌజన్య గురు వారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం గులుమూరు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఇక్కడి రెగ్యులర్ ఈవో టి.హరికృష్ణ గత రెండు నెలలుగా సెలవులో ఉన్నారు. ఇటీవల లాంగ్‌లీవ్ పెట్టడంతో ఆయన స్థానంలో శివాజీని నియమించినట్లు ఎంపీడీవో కాళీ ప్రసాదరావు తెలిపారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడి

పోలాకి, మే 1(ఆంధ్రజ్యోతి): ఈదులవలస మోడల్ స్కూల్‌లో ఇటీవల ఆరోతరగతి ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షల ఫలితాలు వచ్చాయని ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. 316 మంది పరీక్షలకు హాజరయ్యారన్నారు. పరీక్షల్లో వచ్చిన మార్కుల ప్రతిభ ఆధారంగా ఎంపిక జాబితాలను జిల్లా అధికారులు ప్రకటిస్తారన్నారు. అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్లకు సమాచారం ఇస్తున్నామన్నారు. ఈనెలాఖరులో ప్రవేశాలుంటాయన్నారు. అవసరమైన నిజ ధ్రువీకరణ పత్రాలను కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు 9949245179 నెంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

మరో రెండు నెలలు

(ఐదో పేజీ తరువాయి)

చాపర, కొసమాళ, వసుంధర, రట్టిణి, గొప్పిలి, పెద్దలక్ష్మీపురం, గంగరాజపురం, జగన్నాథపురం వంటి గ్రామాల్లో అధికంగా ఒడిశాకు చెందిన వ్యక్తులకు రేషన్‌కార్డులు ఉన్నట్టు తెలుస్తోంది. ఈకేవైసీ ప్రక్రియ శతశాతం పూర్తయితే ఇటువంటి బోగస్ కార్డుల లెక్క తేలనుంది. ఈ విషయమై మెళియాపుట్టి తహసీల్దార్ బి.పాపారావు వద్ద ప్రస్తావించగా.. జూన్ నెలాఖరులోగా ఈకేవైసీ నవీకరణ పూర్తిచేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో డీలర్ల వద్ద బయో మెట్రిక్ పడకపోతే.. మళ్లీ మీ-సేవ కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోండి

మందస, మే 1(ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణతో ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు, రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ సభ్యుడు బావన దుర్యోధన అన్నారు. మందసలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. 90 రోజుల పాటు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి తాతారావు, జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్, టీడీపీ సభ్యుడు లబ్బ రుద్రయ్య, ఆర్.మోహనరావు, డి.తిరుపతి, రట్టి లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరుబుజ్జిలి, మే 1 (ఆంధ్రజ్యోతి):యరగాం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు, మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పైడి యోగీశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గోనెపాడు, ఒప్పడాం, కేజీపేట, కాగితాలపల్లి, తెలికిపెంట, పాతపాడు, యరగాం, సుబ్బపేట, పెద్ద సవలాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

●పొందూరు, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొందూరు, కింతలి సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, చెట్టుకొమ్మలు తొలగించనుండడంతో శుక్రవారం విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగనుందని ఆ శాఖ ఏఈ పి.యోగేశ్వరరావు తెలిపారు. పొందూరు, దేవరవలస ఫీడర్ పరిధిలో పొందూరు, జోగన్నపేట, తండ్యాం, మల్లేశుపేట, దమ్ము పేట, మీసాలపేట, కిల్లారిపేట గ్రామాలకు, కింతలి ఫీడర్‌పరిధిలో అచ్చిపోలవలస, సింగూరు, ఎస్‌జీఎస్‌పేట, మొదలవలస, బొడ్డేపల్లి, దళ్ళవలస, ధర్మపురం, పిల్లలవలస, పెనుబర్తి అలమాజీపేట తదితర గ్రామాలకు ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

●ఇచ్ఛాపురం, మే 1(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం 132-32కేవీ, కొళిగాం, ఈదుపురం సబ్‌స్టేషన్ పరిధిలోగల విద్యుత్ మెంటినెన్స్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ జి. జ్ఞానేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలో అన్ని వార్డులతో పాటు మండలం అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

నేటి నుంచి ఆదిశంకరాచార్యుల జయంతి

శ్రీకాకుళం కల్చరల్, మే1 (ఆంధ్రజ్యోతి): ఆదిశంకరాచార్యుల జయంతి మహోత్సవాలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు గుజరాతిపేటకు చెందిన శ్రీరాజరాజేశ్వరి లలితా మహాత్రిపుర సుందరీదేవి పీఠం పండితులు పెంటా రామచంద్రశేఖర్ శర్మ ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల 11 వరకూ పలుకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి

ఆమదాలవలస, మే 1 (ఆంధ్రజ్యోతి):పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సర్పంచ్ మామిడి దమయంతి కోరారు. మండలంలోని తురకపేటలో ఇంటింటికి రెండుచెత్త బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హిమబిందు పాల్గొన్నారు.

అల్లినగరంలో చిత్రలేఖనం పోటీలు

ఎచ్చెర్ల, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లినగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. శ్రీకాకుళానికి చెందిన లోకనాథం ఆర్ట్ గ్యాలరీ తరపున విజేతలకు బహుమతులు అందజేస్తామని పాఠశాల హెచ్‌ఎం పార్థసారధి తెలిపారు. ఈనెల ఎనిమిదో తేదీ వరకు నిర్వహించే శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని పాఠశాల డ్రాయింగ్ టీచర్ లోకనాథం శంకర్ ప్రకాష్ స్వామి కోరారు.

మత్స్యకారుల కోసం వైద్యశిబిరాలు: డీఎస్పీ

ఎచ్చెర్ల, మే 1(ఆంధ్రజ్యోతి):తీరప్రాంత రక్షణతోపాటు మత్స్యకారుల ఆరోగ్యానికి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు మెరైన్ డీఎస్పీ బి.నాగేశ్వరరావు తెలిపారు. గురువారం మండలంలోని డి.మత్స్యలేశం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మత్స్యకార సంఘ భాగస్వామ్యంతో మెరైన్ పోలీసు, జెమ్స్ ఆసుపత్రి సంయుక్తంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల వేట నిషేధం సమయంలో మత్స్యకారులంతా స్వగ్రామాల్లోనే ఉంటారన్న ఉద్దేశ్యంతో వైద్య శిబిరాలను ఏర్పాటుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మూగి శ్రీరాములు, కళింగపట్నం మెరైన్‌ఇన్‌స్పెక్టర్లు జి.హరికృష్ణ, కె.మహాలక్ష్మి, ఏఎస్ఐ వెంకటరావు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సురేష్, వ్యాయామోపాధ్యాయుడు సీహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

సోంపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని, పాఠశాల నోటీస్ బోర్డులో ఉంచినట్లు ప్రిన్సిపాల్ చిన్నాజి వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కొద్దిరోజుల్లో మెరిట్‌లిస్టు తయారుచేసి అర్హతగల అభ్యర్థులకు ఫోన్‌లో సమాచారం ఇస్తామని పేర్కొన్నారు. అర్హతగల అభ్యర్థులు జాయినింగ్ సమయంలో కుల,జనన, ఆదాయ తదితర ధ్రువీకరణపత్రాలతో హాజరు కావల్సి ఉంటుందని తెలిపారు.

●ఇచ్ఛాపురం, మే1(ఆంధ్రజ్యోతి):పురుషోత్తపురం ఏపీ ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి గత నెలలో నిర్వహించిన ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని ప్రిన్సిపాల్ దుంపల వైకుంఠరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల వివరాలు స్కూల్ నోటీస్‌బోర్డులో పెడతామని పేర్కొన్నారు.బుద్దా నవ్యశ్రీ 100 మార్కులకు గాను 88మార్కులుం, బుద్దా నవీన 85మార్కులు, ఉప్పాడ కుసుమ 82మార్కులతో వరుస స్థానాల్లో నిలిచారని తెలిపారు. రూల్స్ ఆఫ్ రిజర్వేషన్,రోస్టర్ ప్రకారం కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి అనుమతి పొందిన తరువాత ఎంపికైన విద్యార్థుల జాబితా ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

విద్యతోపాటు క్రీడలు అవసరం: ఎంఈవో

బూర్జ, మే 1 (ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు ప్రతి విద్యార్థికి క్రీడలు అవసరమని మండల విద్యాశాఖాధికారి ధనుంజయరావు తెలిపారు. గురువారం మండలంలోని కె.కె.రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ నేతృత్వంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ కార్యక్రమాన్ని సర్పంచ్ కొరికాన వెంకటసాయిశివసాయి సీతారామరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై.మాలతి, మండల స్పోర్ట్స్ ఆర్గనైజర్ నెల్లి వెంక టరమణ, స్థానిక నాయకులు వెంకటరావు, కత్తెర అశోక్‌కుమార్, కొరికాన సూరన్నాయుడు, అప్పన్న, ఉపాధ్యాయులు గోపికృష్ణ పాల్గొన్నారు.

కొబ్బరి రైతులను ఆదుకోండి

కవిటి, మే1(ఆంధ్రజ్యోతి):తమను ఆదుకోవాలని ఉద్దానంప్రాంతంలోని కొబ్బరి రైతులు కోరారు.ఈమేరకు గురువారం రామయ్యపుట్టుగలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ బి.అశోక్‌ను వారంతా కలిసి వినతిపత్రాన్ని అందజేసి, సమస్యను వివరించారు. ఈ సందర్భంగా కొబ్బరికి తెల్లదోమ తాకిడితో పంట నామరూపాలు కోల్పోయిందని వివరించారు. జీడి, మామిడి అలాగే అంతరపంటలు ఈఏడాది పూర్తిగా దెబ్బతీన్నాయని తెలిపారు.రైతులకు పంటల బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంటల బీమా చెల్లించిన రైతులకు బీమా సౌకర్యం వచ్చేలా చూడాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని విప్ అశోక్ రైతులకు తెలియజేశారు.

జెమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స


శస్త్రచికిత్స అనంతరం చేయి

అరసవల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): జెమ్స్ వైద్యులు తెగిపోయిన నరం, రక్తనాళం అతికించేందుకు అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. వైద్యులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గార మండలంలోని అచ్చెన్నపాలెం గ్రామానికి చెందిన శిమ్మ నీలకంఠం వెల్డర్ పని చేస్తున్నాడు. గతనెల 30న ప్రమాదవశాత్తు కటింగ్ మెషిన్ జారిపోవడంతో ఆయన కుడి చేయి తెగిపోయింది. కుడిచేతికి సంబంధించిన నరం, రక్తనాళం కూడా తెగిపోయాయి. దీంతో ఆ చేయి పనిచేయని పరిస్థితి నెలకొంది. వెంటనే విశాఖలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ఆపరేషన్‌కు మూడు నుంచి ఐదు లక్షలు ఖర్చు అవుతుందని తెల్చారు.దీంతో శ్రీకాకుళానికి నీలకంఠాన్ని తీసుకొచ్చారు. అనంతరం జెమ్స్ వైద్యులను సంప్రదించారు. ఇక్కడ ప్లాస్టిక్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ బుల్లి పరిశీలించారు. వెంటనే ఆపరేషన్ చేయాలని పేర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవల ద్వారా ఉచితంగా సుమారు ఐదుగంటల పాటు శ్రమించి తెగిపోయిన నరం, రక్తనాళం అతికించి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. తమ కుమారుడి కుడి చేతికి ఆపరేషన్ చేయించి జీవితాన్ని ప్రసాదించిన డాక్టర్ బుల్లికి రోగి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.


రాళ్లుతేలి గోతులమయమైన నగరంపల్లి బీటీ రోడ్డు

నిర్వహణ లేక.. మరమ్మతులకు నోచుకోక

●అడుగడుగునా గోతులమయమైన వైనం ● వాహనచోదకులకు అగచాట్లు ●ఇదీ వజ్రపుకొత్తూరు- పెద్దబాడాం రోడ్డు పరిస్థితి

వజ్రపుకొత్తూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు నుంచి నగరంపల్లి మీదుగా పెద్ద బాడాం వరకు ఉన్న బీటీ రోడ్డు నిర్వహణపై పంచాయతీరాజ్ అధికారులకు పర్యవేక్షణ లేకపోవడంతో అధ్వానంగా మారింది. మరమ్మతులకు నోచుకోకపోవడంతో పెచ్చులూడడంతో పాటుఅడుగడుగునా గోతులమయంకావడం వల్ల వాహనచోదకులు, ప్రయాణికులు అగచాట్లకు గురవుతున్నారు.పదికిలోమీటర్ల మేర ఉండే ఈమార్గం మూడేళ్లుగా మరమ్మతులకు సైతం నోచుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు, నగరంపల్లి, సీతాపురం, బొడ్డపాడు తదితర గ్రామాల ప్రజల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. ప్రతి రోజూ ఈ మార్గంలో అన్నిరకాల వాహనాలు వెయ్యి వరకూ రాకపోకలు సాగిస్తుంటాయి. అటు పలాస, ఇటు హూండి వైపు కూడా ఆయా గ్రామాల ప్రజలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగించాల్సిఉంది.హూండి,పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో చదువుకునే కళాశాలల విద్యార్థులు గోతులమయమైన రోడ్డులో రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. ఇదేమార్గంలో సమీపంలో తీర గ్రామాల మత్స్యకారులు తమ ఉత్పత్తులను పలాస తదితర ప్రాంతాల్లోని మార్కెట్లకు తరలిస్తుంటారు.రోడ్డుపై పెద్దపెద్ద గోతులుఏర్పడడంతో చీకటిపడిన తర్వాత వచ్చే ద్విచక్రవాహనాలు పల్టీలు కొట్టడంతో గాయపడుతున్నామని పలువురు వాపోతున్నారు. కనీసం గోతుల వద్ద మరమ్మతులు చేయాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం ఉండడంలేదని వాహనచోదకులు చెబుతున్నారు.పంచాయతీరాజ్ అధికారులు రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టాలని పరిసర గ్రామస్థులు కోరుతున్నారు.


రణస్థలం: జేఆర్‌పురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎన్ఈఆర్


ఆమదాలవలస: కొరపాం పంచాయతీలో పింఛన్ పంపిణీ చేస్తున్న పీయూసీ చైర్మన్ రవికుమార్

సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం

●జిల్లాలో పింఛన్లను పంపిణీచేసిన ప్రజాప్రతినిధులు

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయమని ప్రజా ప్రతినిధులు, అధికారులు తెలిపారు.గురువారం జిల్లాలోని పలు చోట్ల అధికారులు, ప్రజా ప్రతినిధులు సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీచేశారు.

ఆమదాలవలస, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరపాం పంచాయతీలో ఇంటింటికి వెళ్లి పింఛన్లను పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ పంపిణీచేశారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ తమ్మినేని చంద్రశేఖర్, సర్పంచ్ చేపేన సత్తిరాజు, టిడిపి నాయకులు కోరుకొండ వెంకటరమణ, ఉదయ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●కవిటి, మే1(ఆంధ్రజ్యోతి): రామయ్యపుట్టుగలోని ఇచ్ఛాపురం నియోజక వర్గంలోని కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం,సోంపేట మండలాల్లో కొత్తగా మంజూ రైన వివిద రకాల 35 కొత్త పింఛన్లను ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ బి.అశోక్ అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, కళింగ కార్పొరే షన్ డైరెక్టర్ బి.చిన్నబాబు పాల్గొన్నారు.

●రణస్థలం, మే 1 (ఆంధ్రజ్యోతి):జేఆర్‌పురం పంచాయతీ పరిధిలోని పలువురికి ఎమ్మెల్యే నడుకదిటి ఈశ్వరరావు సామాజిక పింఛన్లు అందజేశారు. పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో సీటూ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొన్నారు. అదేవిధంగా జేఆర్‌పురం పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర కాలనిలో సీసీ రోడ్లు, కాలువల, వీధిలైట్లు ఏర్పాటు, వాటర్ ట్యాంకు నిర్మాణం కోసం ఎమ్మెల్యేకు స్థానికులు దరఖాస్తు చేసుకున్నారు.

●పోలాకి, మే 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లబ్ధిదారులకు ఠంచన్‌గా ఇంటివద్దే పింఛన్లను అందజేస్తోందని ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి పేర్కొన్నారు. మబగాంలో ఎన్టీఆర్‌భరోసా పింఛన్ల డబ్బులు ఆయన చేతుల మీదుగా లబ్దిదారులకు పంపిణీ చేశారు.

●పాతపట్నం, మే 1(ఆంధ్రజ్యోతి): పాతపట్నం తుంబేశు పేటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.

బీచ్ ఫెస్టివల్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్/సోంపేట, మే 1(ఆంధ్రజోతి):బారువ బీచ్‌లో ఈనెల 3, 4 తేదీల్లో జరిగే బీచ్ ఫెస్టివల్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గురువారం శ్రీకాకుళంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి అన్ని శాఖల అధికారులతో ఫెస్టివల్ ఏర్పాట్లపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి 70 నుంచి 80మంది క్రీడాకారులు హాజరుకానున్నారని తెలిపారు. పలాస ఆర్డీవో ఓవరాల్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని, హరిత రిసార్ట్స్‌ను సిద్ధంగా ఉంచాలని, పబ్లిక్ పార్కింగ్, బారికేడింగ్ వంటి అంశాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతను శ్రీకాకుళం ఆర్డీవోకు అప్పగించామని తెలిపారు. బీచ్ పరిసరాల్లో పరిశుభ్రత, ఫుడ్ స్టాళ్ల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేదని చెప్పారు. బోటు షికారుకు భద్రతతో పాటు ప్రయాణికులకు తక్కువ రుసుముతో ఉత్తమ అనుభవం కలిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జలక్రీడలను ఉత్తమంగా నిర్వహించాలని కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పకడ్బందీగా ఏర్పాట్లు ఉండాలన్నారు. వ్యవసాయం, మత్స్య, సివిల్ సప్లయిస్, పంచాయతీ, క్రీడా ప్రాధికార సంస్థలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

డిగ్రీ విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సు

అరసవల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): డిగ్రీ చదివిన విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సును నిర్వహిస్తున్నామని బొలినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. వైద్య, ఆరోగ్య రంగంలో నైపుణ్యాలను అందించే ఈ సర్టిఫికెట్ కోర్సుకు డిగ్రీపాసైన లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు ఉండాలని తెలిపారు. ఏడాది వ్యవధిగల ఈ కోర్సుకు ఆరు నెలల పాటు అభ్యర్థులకు స్టయిఫండ్ అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కోర్సు పూర్తయిన అనంతరం ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఇంటర్‌పాసైన విద్యార్థులకు డిప్లమో, బీఎస్సీ ఎంఎల్‌టీ, పారా మెడికల్, బీపీటీ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7680945357, 79950 13422 నంబర్లకు ఫోన్‌చేసి గానీ లేదా రాగోలులోని జెమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలోని తమ సంస్థలో సంప్రదించాలని ఆయన కోరారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఇద్దరి ఎంపిక

లావేరు,మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురపాక కేజీబీవీ పాఠ శాలలో చదువుతున్న ఇద్దరి విద్యార్థినులు మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారు. పదోతరగతిలో సత్తాచాటిన కె.కుసుమ కుమారి, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ప్రతిభచూపిన సీహెచ్ హేమలతకు విజయనగరం మానస ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్ గజపతిరాజు చేతుల మీదుగా మెరిట్ స్కాలర్ షిప్‌ను అందజేశారు. కార్యక్రమంలో మురపాక కేజీబీవీ ప్రత్యేకాధికారి బి.సుధ పాల్గొన్నారు.

ఊరు లేదు.. అమ్మవారు ఉంది

● ఘనంగా కావేరమ్మ ఆలయ మండపం ప్రారంభం


మండపం వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఆమదాలవలస, మే 1(ఆంధ్రజ్యోతి):రామచంద్రాపురం-చెవ్వాకులపేట గ్రామాల మధ్యలో 1980 సంవత్సరానికి ముందు కనకముడిపేట అనే గ్రామం ఉండేది. వంశధార నదికి 1980లో భారీ వరదలు రావడంతో ఇక్కడ నివసించే గ్రామస్థులంతా వరద తాకిడికి గ్రామాన్ని ఖాళీచేసి... వేర్వేరు ప్రాంతాలకు చెదిరిపోయారు. అక్కడ ఊరు పేరు ఉంది కానీ... గృహాలు లేవు. గ్రామంలో ఆరాధ్యదైవంగా కొలుచుకొనే అమ్మవారు (అసిరితల్లి) ఉంటారు. అక్కడ ప్రస్తుతం గృహాలు లేకపోయినా గ్రామం పేరుతో కావేరి అమ్మవారు నిత్యం పూజలు అందుకోవడం విశేషం. రామచంద్రాపురం గ్రామస్థులు ఎటువంటి శుభకార్యం చేసినా ఆ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. ప్రతి ఏటా అక్కడ అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. గ్రామస్థులంతా కలిసి ఏటా అమ్మవారికి ముర్రాటలు సమర్పిస్తారు. పంట పొలాల్లో అమ్మవారి పేరుతో చెట్టుకు పూజలు నిర్వహించి.. మొక్కులు చెల్లిస్తారు. వర్షాకాలంలో పూజలు చేసేందుకు గ్రామస్థులంతా తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. దీంతో అందరూ కలిసి అమ్మవారికి మండపాన్ని నిర్మించారు. ఈ నూతన మండపానికి గ్రామస్థులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి, ముర్రాటలు సమర్పించి ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండపం ఆవరణలో అన్న సంతర్పణ చేశారు.

రమేష్‌కు అకడమిక్ అడ్వైజర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు

అరసవల్లి/గుజరాతీపేట, మే 1(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన పి.వెంకట రమేష్ విశ్వవిద్యా సమ్మేళనం- 2025లో అకడమిక్ అడ్వైజర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకున్నారు. పరిశోధన ఆధారిత కార్యక్రమాలు, అధ్యాపకుల అభివృద్ధి శిబిరాలు, అకడమిక్ పబ్లిషింగ్, మేధస్సు సేవల ద్వారా విద్యారంగానికి విశేష సేవలందించినందుకు అవార్డుకు ఎంపికయ్యారు. వీఆర్ ఎడ్యుకేర్ వ్యవస్థాపకుడు, సీఈవో రమేష్ తనసంస్థ ద్వారా ఏపీ, తెలంగాణతోపాటు ఆరురాష్ట్రాల్లో గల విద్యాసంస్థలకు మార్గదర్శకత్వం అందిస్తున్నారు. ఆయన మన్యం జిల్లాలో మూడు గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నారు. ఢిల్లీలోని హోటల్ ది పార్క్‌లో ఏషియా టుడే మీడియా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్య క్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి రాజభూషణ్ చౌదరి, ఢిల్లీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ మోహన్‌సింగ్ బిష్త్ చేతులమీదుగా అందుకున్నారు.

శ్రీనివాస్‌కు ఉగాది తెలుగు వెలుగు నంది పురస్కారం

గార, మే 1(ఆంధ్రజ్యోతి):మండలంలోని జోన్నలపాడులోగల శ్రీ బృందావనం ప్రతినిధి, ఆర్ట్‌ఆఫ్ లివింగ్ గాయకుడు చౌదరిశ్రీనివాస్‌కు తెలుగువెలుగు ఉగాదిమహానంది జాతీయ పురస్కారంలభించింది. విశాఖ పౌరగ్రంథాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో తెలుగువెలుగు సాహితీవేదిక నిర్వాహకుడు శ్రీనివాస్‌కు పురస్కారం ప్రదానంచేశారు.

ఎచ్చెర్ల ఇన్‌చార్జి ఎంపీడీవో సస్పెన్షన్

రణస్థలం, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ఇన్‌చార్జి ఎంపీడీవో బి.మల్లేశ్వరరావును సస్పెండ్ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఎంవీఆర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీచేశారు. టెక్కలి పంచాయతీలో ఇన్‌చార్జి కార్యదర్శిగా ఉన్న సమయంలో 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిధులు దుర్వినియోగానికి పాల్పడిన అభియోగంపై సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈవోపీఆర్డీగా ఉన్న మల్లేశ్వరరావు ఇన్‌చార్జి ఎంపీడీవోగా కొనసాగుతున్నారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

సోంపేట, మే 1(ఆంధ్రజ్యోతి):బారువ శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ప్రభుత్వపాఠశాల విద్యార్థులకు గురువారం పత్రికల పఠనం గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, పందిరి వేమన పాల్గొన్నారు.

హరిచండీమాత ఆలయం ప్రారంభం


కవిటి, మే1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెవరపుట్టుగ, చిన్నమునిపుట్టుగ, బొయిలిపుట్టుగ గ్రామ సరిహద్దులో నూతనంగా నిర్మించిన హరిచండిమాత ఆలయం గురువారంప్రారంభించారు.అలాగే చిన్నకర్రివానిపాలెంలో జరుగుతున్న మహారుద్రయాగం కొనసాగుతోంది. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ పి.విజయ, ఎమ్మెల్యే ఎన్.రామారావు,మాజీ మంత్రి ఎస్.అప్పలరాజులు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు పెడుతుండడంతో అవస్థలు


రోడ్డు పక్కన చెత్తకు నిప్పుపెట్టిన దృశ్యం

గార, మే 1 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బోరవానిపేట వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే చెత్త కుప్పలు నిత్యం కాల్చుతుండడంతో వాహన చోదకులు, ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు. నిత్యంరద్దీగా ఉండే ఈ రోడ్డుకు దగ్గరలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉన్నాయి. ఈనేపథ్యంలో చెత్త తెచ్చి ఇక్కడవేయడంతో పాటు నిప్పుపెట్టడంతో పొగ వల్ల ఇబ్బందిపడుతున్నామని పలువురు వాపోతున్నారు.కాగా బోరవానిపేట వద్ద రోడ్డు పక్కనే చెత్త పరిశీలించి చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి తెలిపారు.

బీట్ వ్యవస్థను పటిష్ఠంచేయండి: ఎస్పీ


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల,మే 1(ఆంధ్రజ్యోతి): రాత్రి సమయంలో గస్తీవిధులను పకడ్బందీగా నిర్వహించి బీట్ వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు.గురువారం ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ముఖ్యమైన రికార్డులు, వివిధ కేసుల దర్యాప్తు, నాన్ బెయిల్ వారెంట్ల వివరాలపై ఆరాతీశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలను సందర్శించి అల్లర్లు, ఘర్షణలు సృష్టించిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. గ్రామస్థులతో మమేకమై శాంతియుత వాతావరణం నెలకొనేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు చేపట్టాలని తెలిపారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజూ గ్రామాలను సందర్శించి మహిళలు, చిన్నారులు సంబంధిత నేరాలు, మాదక ద్రవ్యాలు నియంత్రణ, సైబర్ నేరాలపై అవగాహన, రోడ్డు ప్రమాదాల నివారణ, శక్తి యాప్‌పై విస్తృత ప్రచారం చేపట్టాలని కోరారు. ఆయన వెంట ఎస్ఐ వి.సందీప్‌కుమార్ ఉన్నారు.

అన్ని మండలాల్లో క్రీడాశిబిరాలు: డీఎస్‌డీవో

గుజరాతీపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాలకు ఏదో క్రీడ చొప్పున శిబిరాన్ని కేటాయించామని, ఆయా మండలాల విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డాక్టర్ కె.శ్రీధర్ కోరారు. గురువారం శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో నెలరోజుల పాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే 50 వేసవి క్రీడా శిక్షణా శిబిరాల ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శిబిరాలను ఆరేళ్లవయస్సు చిన్నారుల నుంచి 14 ఏళ్ల బాలబాలికలు పాల్గొనవచ్చునని, అక్కడి శిక్షకులు ఉచితంగా తర్ఫీదు ఇస్తారని తెలిపారు. ప్రతిరోజూ రెండుపూటలా నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో శిక్షణ ఇస్తున్న శిక్షకులు కూడా అదనంగా తర్ఫీదు ఇస్తారన్నారు. ఇప్పటికే కోడిరామ్మూర్తి స్టేడియం, ఆర్ట్స్ కళాశాలలో వందలాది మంది క్రీడాకారులు వివిధక్రీడంశాల్లో శిక్షణ తీసుకుంటున్నారన్నారు.కార్యక్రమంలో జిల్లా పర్యటక అధికారి నారాయణరావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ముఖ్య సలహాదారు పి.సుందరరావు, మాధురి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్